# సాక్షి శ్రీకాకుళం

శనివారం ၊ 1 ၊ ఫిబ్రవరి ၊ 2025



**దర్శనాల్లో వీఐపీ ట్రీట్‌మెంట్ రద్దు!**

రథసప్తమికి వీఐపీ ట్రీట్‌మెంట్లు రద్దు చేశారు. ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

- 8లో



**సంబరాలకు సర్వం సిద్ధం**

రథ సప్తమి సంబరాలకు సర్వం సిద్ధమైంది. కలెక్టర్ అధికారులతో సమీక్షించారు.

- 8లో

**దళ్లవలస వీఆర్‌ఓ సరెండర్**

పొందూరు: మండలంలోని దళ్లవలస వీఆర్‌ఓ తవుడుపై పలు ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ వెంకటేష్ రామానుజులు గురువారం రాత్రి శ్రీకాకుళం ఆర్డీఓకు సరెండర్ చేశారు. గతంలో పొందూరు వీఆర్‌ఓగా పనిచేసిన తవుడుపై పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటన్నిటిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్ వెంకటేష్ రామానుజులను ఆదేశించారు. నివేదిక మేరకు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు.

## న్యూస్‌రీల్

### మహిళలకు రక్షణ కరువు

- విశాఖలో పరామర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్



ఆస్పత్రిలో మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వంలో మహిళలకు, విద్యార్థినులకు, చిన్నారులకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. విశాఖ పట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినిని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థిని కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళకు రక్షణ లేదని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోం మినిస్టర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ ఆరు నెలల్లో ఎన్నో అఘాయిత్యాలు జరిగాయని అయినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థినిని పరామర్శించిన వారిలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, పేడాడ రమణకుమారి, బెందాళం సత్యవతి ఉన్నారు.

### నిందితుల్ని కఠినంగా శిక్షించాలి



ఉలాల భారతిదివ్య

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళాధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య అన్నారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. మూడునెలల కిందట శ్రీకాకుళం జిల్లాలో ఇద్దరు విద్యార్థినులపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటన మరువక ముందే మహిళా డిగ్రీకళాశాల విద్యార్థిని దాడికి గురి కావడం బాధాకరమని అన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో గల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోగల హాస్టల్స్‌కు సరైన రక్షణ కల్పించాలని, విద్యార్థినుల రక్షణ విషయంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరచడం బాధాకరమన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయకుండా ఉండాలని, ప్రైవేటు వ్యక్తులు రాకుండా నిరోధించాలని కోరారు. బాధితురాలిని వారు పరామర్శించారు. పరామర్శించినవారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.పవిత్ర, డి.చందు, టౌన్ కమిటీ సభ్యులు రాహుల్, జగదీష్ ఉన్నారు.

### బీసీ హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : శ్రీకాకుళం మహిళా కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం-3 వార్డెన్ ఎం.పూర్ణను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం రాత్రి హాస్టల్ విద్యార్థినిపై జరిగిన దాడి నేపథ్యంలో కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. హాస్టల్ విద్యార్థినిపై బయట వ్యక్తులు దాడి చేసిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కావడంతో కలెక్టర్ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు.



శరీరం నిండా గాయాలు.. మనసు నిండా బాధ.. ఏడిచేందుకు కూడా వీల్లేని స్థితి. అపస్మారక స్థితిలో నిండా ఇరవై ఏళ్లు లేని అమ్మాయి పడుతున్న నరక యాతన ఇది. ఓ వైపు తన చుట్టూ ఏం జరుగుతుందో తెలీని దుస్థితిలో అమ్మాయి ఉంటే.. ఆమె చుట్టూ గురువారం మొదలుకుని శుక్రవారం వరకు హైడ్రామా నడిచింది. ఫిట్స్ వచ్చిందని కాసేపు, లైంగిక దాడి జరిగిందని మరికాసేపు, హత్యాయత్నం జరిగిందని ఇంకాసేపు ప్రకటనలు రావడంతో అమ్మాయి కుటుంబ సభ్యులతో పాటు తోటి విద్యార్థినులు కూడా అయోమయానికి గురయ్యారు. అనేక దర్యాప్తుల తర్వాత అమ్మాయిపై హత్యాయత్నం జరిగినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. మెరుగైన వైద్య చికిత్స కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ దారుణ ఘటనలో సమాధానంలేని ప్రశ్నలెన్నో..

# నగరంలో దారుణం

- మహిళా కళాశాలలో విద్యార్థినిపై పాశవిక దాడి
- అపస్మారక స్థితిలోకి విద్యార్థిని
- 'అకృత్యం' వెనుక అనుమానాలెన్నో..
- పొంతన లేకుండా అధికారుల ప్రకటనలు
- హత్యాయత్నంగా కేసు నమోదు
- వార్డెన్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/శ్రీకాకుళం క్రైమ్:

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో ఓ విద్యార్థినిపై పాశవిక దాడి జరిగింది. ఆమెపై లైంగికదాడి జరిగిందనే వార్తలు స్థానికంగా సంచలనం రేపాయి. తీవ్రంగా గాయపడడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. అయితే ఈ ఘటనపై పోలీసులు, హాస్టల్ అధికారులు, తోటి విద్యార్థినులు, బాధితురాలి కుటుంబ సభ్యులు ఒక్కో రకంగా వాదనలు వినిపించడం గమనార్హం. స్థానికులు, తోటి విద్యార్థినులు, విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు, పోలీసులు చెప్పిన వివరాల మేరకు..

జిల్లా కేంద్రంలోని మహిళా కళాశాల ప్రాంగణంలో హాస్టళ్లు కూడా ఉన్నాయి. గురువారం రాత్రి ఆ ప్రాంగణంలో అమ్మాయి ఏడుపు శబ్దం వినిపించడంతో అటుగా వస్తున్న ఓ మహిళ లోపలకు వెళ్లి చూశారు. అక్కడ ఓ విద్యార్థి ఏడుస్తూ కనిపించడంతో ఆమెను బయటకు తీసుకువచ్చారు. ఏదో చెప్పబోతుండగానే ఆ విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో ఆమెతో పాటు విద్యార్థినులు కూడా అక్కడకు చేరారు.

విద్యార్థినికి ఫిట్స్ వచ్చి పడిపోయిందని చెప్పి రాత్రి 8.30 గంటల ప్రాంతంలో రిమ్స్‌కు తరలించారు. అయితే రాత్రి 9.30 గంటలకు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పానని హాస్టల్ వార్డెన్ చెబుతున్నారు. కానీ ఆ టైమ్‌కు తమకు ఎవరూ ఫోన్ చేయలేదని తల్లిదండ్రులు చెప్పడం గమనార్హం. రాత్రి 11 గంటలకు విద్యార్థిని కుటుంబ సభ్యులు రిమ్స్‌కు చేరుకున్నారు. పాప ఎడమ కంటి మీద, తలకు, మెడ కింద గాయాలు కనిపించాయని తండ్రి తెలిపారు. పాపకు చిన్నప్పటి నుంచి ఫిట్స్ సమస్య లేదని, మన్యం జిల్లా సీఐ ప్రసాద్ వచ్చి ఎవరు అడిగినా ఫిట్స్ వచ్చి పడిపోయిందని చెప్పాలని కోరారని పేర్కొన్నారు. ఆ సీఐ వార్డెన్ భర్తేనని చెప్పారు. తాము పాప పడిపోయిన స్థలాన్ని కూడా రెండు సార్లు చూశామని, రెండోసారి వెళ్లేటప్పుడు ఆ స్థలమంతా శుభ్రం చేసి ఉందని విద్యార్థిని మేనమామ, చిన్నాన్నలు చెప్పారు. పోలీసులు గురువారం రాత్రి మీడియాకు విద్యా ర్థినికి ఫిట్స్ వచ్చి పడిపోయిందనే సమాచారం అందజేశారు.

**రంగంలోకి కలెక్టర్..**

విద్యార్థినిపై అఘాయిత్యం జరిగిందని మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ పెద్ద ఎత్తున కథనాలు రావడంతో సీఎంఓ నుంచి, హోంమంత్రి నుంచి, జిల్లా మంత్రి.. ఆరా తీస్తుండటంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రంగంలోకి దిగారు. తొలుత ఘటన జరిగిన మహిళా కళాశాల ప్రాంగణంలోని ప్రదేశాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న చెత్త చెదారం పరిస్థితులను గురించి గట్టిగా నిలదీశారు. 'రాత్రి 7.20 ప్రాంతంలో కళాశాల ప్రాంగణంలోకి ఇద్దరు ఎంటర్ అయినట్లు సీసీ ఫుటేజీలో రికార్డ్ అయ్యింది. తర్వాత 7.30 ప్రాంతంలో అమ్మాయి అరుపులు వినడం 7:50 గంటలకు అంతా అక్కడికి చేరారు. అయితే అదే సమయంలో విజుబుల్ పోలీసింగ్‌కని ఇద్దరు కానిస్టేబుళ్లు బయట గేటు వద్ద ఉండగా లోపల అవేర్‌నెస్ కార్యక్రమం జరుగుతోందంటూ'.. స్వయంగా పోలీసులు ఘటనాస్థలి సందర్శనకు వచ్చిన కలెక్టర్ వద్ద ధ్రువీకరించడం విశేషం.



ఘటనాస్థలిని డీఎస్పీ వివేకానందతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



ఘటన జరిగిన ప్రాంతం వద్ద కలెక్టర్ పరిశీలన

### దర్యాప్తు ముమ్మరం..

శుక్రవారం ఉదయానికి ఈ వార్త పలు రకాలుగా వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. డీజీపీ రిటైర్‌మెంట్ కార్యక్రమం కోసం ఎస్పీ మహేశ్వరరెడ్డి విజయవాడ వెళ్లడంతో డీఎస్పీ వివేకానంద ఆస్పత్రికి వెళ్లారు. బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బాధితురాలిని తట్టి మాట్లాడేందుకు ప్రయత్నించగా అచేతనంగా ఉండిపోవడంతో బయటకు వచ్చేశారు. ఆయనతో పాటు రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు, ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు, సిబ్బందే కాక రూరల్ పోలీసులు, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ పోలీసులు రిమ్స్‌కు వెళ్లారు. వీరిని చూసి మన్యం జిల్లా సీఐ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

### ఓ వైపు కలెక్టర్‌కు ఫోన్‌లు.. మరో వైపు నో సిగ్నల్..



ఆసుపత్రిలో కలెక్టర్ ఉండగానే సీఎంఓ నుంచో.. హోంమంత్రి నుంచో.. జిల్లా మంత్రుల నుంచో తెలియదు గాని వరుస ఫోన్‌లు వచ్చాయి. అయితే, ఆసుపత్రిలో సిగ్నల్ సరిగా లేకపోవడంతో ఆ ఫోన్‌లకు స్పందించేందుకు ఆయన నానా హైరానా పడ్డారు. వివరణ ఇద్దామని సెల్‌ఫోన్ సిగ్నల్ కోసం ఆసుపత్రి ప్రాంగణంలో చాలా వరకు తిరిగారు. అది చూసి ఏదో జరిగిందన్న అనుమానం అక్కడి ఉన్న వారందరికీ కలిగింది.



మహిళా కళాశాల, హాస్టల్స్ ప్రాంగణం వెనక భాగంలో ప్రహరీ లేకపోవడంతో అవతల ఉన్న ఇళ్లల్లో నుంచి నేరుగా లోపలికి వచ్చే అవకాశం ఉన్న దృశ్యం

# భద్రత డొల్ల.. రక్షణ కల్ల

- శ్రీకాకుళం మహిళా కళాశాల, హాస్టల్స్ ప్రాంగణంలో తేటతెల్లమైన డొల్లతనం
- పూర్తిగా ప్రహరీ లేని వైనం
- గంజాయి బ్యాచ్, మందుబాబులు లోపలకు వెళ్తున్న దాఖలాలు
- పర్యవేక్షణ అంతంతమాత్రమే

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల, వసతి గృహాల ప్రాంగణంలో విద్యార్థినులకు రక్షణ కరువైంది. ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళ్లిపోతున్నారో.. తెలియని పరిస్థితులు అక్కడున్నాయి. గురువారం రాత్రి విద్యార్థినిపై జరిగిన అఘాయిత్యంతో అక్కడి డొల్లతనం మరోసారి బయటపడింది. ఒక కళాశాల, నాలుగు బాలికల వసతి గృహాలు ఉన్న చోట తీసుకోవాల్సిన జాగ్రత్తలేవీ అక్కడ కనిపించడం లేదు. అంతంతమాత్రంగా భద్రత ఉన్న చోట ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇవ్వడంతో రాకపోకలు మరింత పెరిగాయి.

**రక్షణేదీ..?**

శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో కళాశాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల వసతి గృహాలు ఉన్నాయి. ఒక్క హాస్టల్ విద్యార్థులే వెయ్యి మందికి వరకు ఉంటారు. ఇక్కడే వసతి, భోజన వసతులు పొందుతున్నారు. డే స్కాలర్స్ అదనం. దాదాపు 2వేల మంది వరకు విద్యార్థులుండే ఈ ప్రాంగణానికి చుట్టు రక్షణ గోడల్లేవు. మహలక్ష్మీ నగర్ కాలనీ, కుమ్మరి వీధుల్లోని ఇళ్లల నుంచి నేరుగా హాస్టల్స్‌లోకి, కళాశాల ఆవరణలోకి సులువుగా బయట వ్యక్తులు రాకపోకలు సాగించొచ్చు. విద్యుత్ లైట్లు లేక, పెద్ద పెద్ద మొక్కలతో కళాశాల, హాస్టల్స్ వెనక పేరుకుపోయి అడవిని తలపించేలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం కళాశాల ప్రిన్సిపాల్ బ్లాక్ పక్కనున్న వాటర్ ట్యాంక్ దగ్గర దృశ్యాలు చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. అక్కడే వైన్ బాటిల్స్ కూడా కనిపించాయి. ఆకతాయిలు పట్ట పగలే ఇక్కడకు బైక్‌లపై వచ్చి ప్ర మాదకర విన్యాసాలు చేస్తుంటారు. పోలీసుల నిఘా ఉన్నప్పుడు కాస్త తగ్గుతారు. లేదంటే ఆ రోడ్డులో రేసింగ్ చేస్తుంటారు.

**ఎగ్జిబిషన్‌తో తంటాలు..**

ఆడపిల్లలు ఎక్కువగా ఉన్న ప్రాంగణంలోనే ప్రైవేటు వ్యక్తులకు చెందిన ఎగ్జిబిషన్‌కు అనుమతి ఇచ్చారు. దీంతో విచ్చలవిడితనం పెరిగిపోయింది. బయట వ్యక్తుల రాకపోకలకు అడ్డు లేకుండా పోయింది. గంజాయి, మద్యం సేవించే వ్యక్తులకు ఇదే అదనుగా మారింది. ఇప్పటికైనా అలాంటి అవకాశం ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం నిర్ణయాలు తీసుకోవల్సి ఉంది.



మహలక్ష్మీనగర్ కాలనీకి వెళ్లే దారిలో విరగొట్టిన కళాశాల ప్రహరీ

### అలా ఎందుకు చెప్పమన్నారు..?

ఘటన జరిగిన తర్వాత వార్డెన్ భర్త మన్యం జిల్లా సీఐ ప్రసాద్ శ్రీకాకుళం వచ్చి బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఎవరు వచ్చి అడిగినా ఫిట్స్ వచ్చిందని చెప్పాలని కోరినట్లు తల్లిదండ్రులు చెప్పారు.



రిమ్స్ ప్రాంగణంలో హాస్టల్ వార్డెన్ పూర్ణ, ఆమె భర్త మన్యం సీఐ ప్రసాద్

**ఫిట్స్ వచ్చిందని ఎందుకు చెప్పారు..?**

మహిళా కళాశాల విద్యార్థినిపై అఘాయిత్యం జరిగినట్టుగా ఫోన్ వచ్చింది. ఏంటీ సర్ విషయం.. ఎంత వరకు వాస్తవమని వన్‌టౌన్ సీఐ పైడపునాయుడ్ని 'సాక్షి' అడిగింది. అదేమి లేదు. ఫిట్స్ వచ్చి అమ్మాయి పడిపోయింది. మళ్లీ నార్మల్ అయింది. వెళ్లిపోయారని' సీఐ సమాధానమిచ్చారు. ఒక్క సాక్షికే కాదు ఇతర మీడియా వాళ్లు అడిగినా సీఐ అదే సమాధానమిచ్చారు.

ఆ తర్వాత విద్యార్థిని చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ తల్లిదండ్రులతో మాట్లాడారు. బాధితురాలి ఒంటిపై ఉన్న గాయాలను పరిశీలించారు. ఆ తర్వాత తల్లిదండ్రులతో కాసేపు ప్రత్యేకంగా మాట్లాడారు. కాసేపు కౌన్సెలింగ్ చేశారు. విద్యార్థికి శరీరంపై గాయాలు ఉన్నట్లు వైద్యులు కూడా స్పష్టం చేశారు. కానీ రిపోర్టులేవీ చూపించ లేదు. పరిస్థితి క్రిటికల్‌గా ఉందని వేరే ఆస్పత్రికి తీసుకెళ్దామని చెప్పగా, విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లడానికి తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. మధ్యాహ్నం 2గంటల తర్వాత తరలించారు.

**హత్యాయత్నమే అంటూ..**

అడిషనల్ ఎస్పీ కె.వి.రమణ, డీఎస్పీ వివేకానంద మీడియాతో మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసుగా నమోదు చేస్తున్నట్టు ప్రకటించారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు బృందాలను నియమించినట్టు వెల్లడించారు.





విద్యార్థినిపై దాడి జరిగిన ప్రాంతం ఇది. శుక్రవారం ఉదయం 6.30 గంటల వరకు ఇలాగే ఉంది.






ఉదయం 10 గంటల సమయమయ్యేసరికి మద్యం సీసాలు ఇతరత్రా వాటిని తొలగించి మొదటి దానికన్న కాస్త క్లీన్‌గా కనిపించేలా చేశారు. ఇంత తొందరగా ఆ ప్రాంతం క్లీన్ చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.



**క్లూస్ టీమ్ ఆలస్యం వెనుక.. ?**



గురువారం రాత్రి నుంచి ఘటన వార్త దావానలంలా వ్యాపిస్తున్నా.. ఆధారాలు సేకరించాల్సిన క్లూస్ టీమ్ మాత్రం శుక్రవారం ఉదయం 11.15 గంటలకు సంఘటనాస్థలానికి చేరుకుంది. అప్పటికే కలెక్టర్ కూడా సీన్ విజిట్ చేసి వెళ్లిపోయారు. పరిసరాలను శుభ్రం చేశారు కూడా..! అంత ఆలస్యంగా రావడం వెనుక ఆంతర్యమేమిటోననే చర్చ కూడా నగరంలో జరుగుతోంది.

**ఎందుకిలా చేశారు..?**

విద్యార్థినికి ఫిట్స్ వచ్చిందని 9.30గంటలకు బాధితురాలి తల్లిదండ్రులకు సమాచారం అందజేసినట్లు హాస్టల్ వార్డెన్ తెలిపారు. కానీ విద్యార్థిని తల్లిదండ్రులు మాత్రం తమకు ఎవరూ ఫోన్ చేసి చెప్పలేదని, తాము ఫోన్ చేసినప్పుడు తోటి విద్యార్థులు సమాచారం ఇచ్చారని చెబుతున్నారు.

### కీచక పర్వాలకు ముగింపెన్నడు..?

- అతివలపై నానాటికీ పెరుగుతున్న దాడులు

జిల్లాలో వరుస ఘటనలు వణుకు పుట్టిస్తున్నాయి. గొలుసు దొంగతనాలకే భయపడిపోతుంటే.. ఇప్పుడు ఏకంగా హత్యలు, దాడులు కూడా వెలుగు చూస్తున్నాయి. వరుస పెట్టి జరుగుతున్న ఘటనలతో మహిళల రక్షణపై ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.



**కేసుల్లో కొన్ని..**

- ఇటీవల నగరంలోని న్యూకాలనీలో పొందూరుకు చెందిన మహిళ హత్యకు గురైంది.
- గత ఏడాది అక్టోబరు 19 రాత్రి కాశీబుగ్గ కేంద్రంగా ఇద్దరు బాలికలను పుట్టిన రోజు వేడుకలకని పిలిచి ఇద్దరు యువకులు లైంగిక దాడి పాల్పడ్డాడు.
- గత అక్టోబరులో మహిళా కానిస్టేబుల్‌పై ఎస్ఐ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యా దు చేశారు.
- ఇటీవల జిల్లాకేంద్రంలోని ఆర్మీకాలింగ్ పేరిట మైనర్ బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు పెట్టడమే కాక వారిని హింసించినట్లు బీవీ రమణపై బాధిత బాలికలు ఎస్పీ గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు.
- ఆమదాలవలస మండలంలో తొమ్మిదో తరగతి విద్యార్థినిని ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయం చూసి మత్తుమందు కలిపి లైంగిక దాడి.
- టెక్కలిలో ఓ టీచర్ పిల్లలకు అసభ్యకర సందేశాలు పంపిస్తూ దొరికిపోయారు.

ఇలా రాస్తూపోతే అకృత్యాలకు కొదవేలేదు.

- రథసప్తమి వేడుకకు

# రూట్‌మ్యాప్ సిద్ధం

శ్రీకాకుళం క్రైమ్ : రథ సప్తమి వేడుకల నిర్వహణ కోసం జిల్లా యంత్రాంగం సన్నద్ధమైందని జిల్లా అదనపు ఎస్పీ కేవీ రమణ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం డీఎస్పీ సీహెచ్ వివేకానందతో కలసి విలేకరులతో మాట్లాడారు. 2300 మందితో బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. రూట్‌మ్యాప్‌ను వెల్లడించారు.

**రూట్ నంబర్ 1** : ఎచ్చెర్ల నుంచి శ్రీకాకుళం సింహద్వారం జంక్షన్ మీదుగా వచ్చే భక్తులు కిమ్స్ ఆస్పత్రి-డే అండ్ నైట్ కూడలి-ఏడురోడ్ల కూడలి-ఓబీఎస్ కూడలి-అరసవల్లి మిల్లు కూడలి మీదుగా 80 ఫీట్ రోడ్డు పార్కింగ్, ఎల్.ఎన్.ఫంక్షన్ హాల్ అపోజిట్ లేఅవుట్ ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకోవాలి. అక్కడ నిర్దేశించిన ప్రదేశాల్లో పార్కింగ్ చేసుకుని దర్శనానికి వెళ్లాలి.

**రూట్ నంబర్ 2** : కొత్త రోడ్డు నుంచి బలగ కూడలి మీదుగా విచ్చేసే భక్తులు ఆర్టీసీ కాంప్లెక్స్-అంబేడ్కర్ కూడలి-డేఅండ్‌నైట్ కూడలి-7 రోడ్ల కూడలి-పందుంపుల్ల కూడలి-ఓబీఎస్ కూడలి-అరసవల్లి మిల్లు కూడలి మీదుగా 80 ఫీట్ రోడ్డు పార్కింగ్, ఎల్.ఎన్.ఫంక్షన్ హాల్ అపోజిట్ లేఅవుట్ ఫంక్షన్ హాలుకు చేరి పార్కింగ్ చేసుకోవాలి.

**రూట్ నంబర్ 3** : పెద్దపాడు నుంచి రామలక్ష్మణ మీదుగా వచ్చే భక్తులు సూర్యమహల్-చిన్నబరాటం-ఓబీఎస్ కూడలి-అరసవల్లి మిల్లు కూడలి మీదుగా 80 ఫీట్‌కు చేరి పైన పేర్కొన్న చోటనే పార్కింగ్ చేసుకోవాలి.

**రూట్ నంబర్ 4** : నవభారత్, బాలభారత్ మీదుగా వచ్చే భక్తులు గుజరాతీపేట కూడలి-ఏడు రోడ్ల కూడలి-పందుంపుల్ల కూడలి-ఓబీఎస్ కూడలి-అరసవల్లి మిల్లు కూడలి మీదుగా 80 ఫీట్ రోడ్డుకు చేరి పైన పేర్కొన్న చోటనే పార్కింగ్‌కు చేరుకోవాలి.

**రూట్ నంబర్ 5** : గార, శ్రీకూర్మం మీదుగా వచ్చే భక్తులు వాడాడ జంక్షన్ వద్ద వాహనాలను నిర్దేశించిన పార్కింగ్‌లో పెట్టి దర్శనానికి వెళ్లాలి. అరసవల్లి గ్రామం వైపు ఎట్టి వాహనాలు అనుమతించరు.



రూట్‌మ్యాప్ విడుదల చేస్తున్న పోలీసు అధికారులు

**టెక్కలి, నరసన్నపేట నుంచి వచ్చేవారు..**

ఎన్‌హెచ్-16 మీదుగా వచ్చే భక్తులు టెక్కలి-నరసన్నపేట ఎన్‌హెచ్-16-అంపోలు అండర్ బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి అంపోలు జైలు రోడ్డు మీదుగా ఆడవరం గ్రామం-అంపోలు గ్రామం-అంపోలు కూడలి (గార రోడ్డు)-వాడాడ జంక్షన్ వద్దకు చేరుకోవాలి. నిర్దేశించిన పార్కింగ్‌లో వాహనాలను పెట్టుకోవాలి. దర్శనం అనంతరం పార్కింగ్ ప్రదేశం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా టెక్కలి-నరసన్నపేట వైపు తిరిగి వెళ్లేందుకు వాడాడ జంక్షన్-ఒప్పంగి గ్రామం-సానివాడ జంక్షన్-శాస్త్రుల పేట గ్రామం-చెట్టువానిపేట జంక్షన్ నుంచి ఎన్‌హెచ్ -16 మీదుగా వెళ్లాలి.



**పార్కింగ్ ప్లేసులివే..**

- 80 ఫీట్ రోడ్డులో గల కేంద్రమంత్రి స్వగృహం పక్కన ఖాళీ స్థలంలో ఆటోలు, టాటా ఏస్ వాహనాలు నిలుపుకోవచ్చు.
- 80 ఫీట్ రోడ్డులో కేంద్రమంత్రి స్వగృహం ఎదురుగా గల ఖాళీ ప్రదేశంలో ద్విచక్రవాహనాలు, కార్లు పార్కింగ్ చేసుకోవాలి.
- 80 ఫీట్‌రోడ్డులో గల బీకేఎస్ కళాశాల పక్కనుంచి కొత్తగా ఏర్పాటుచేసిన రోడ్డు మార్గంలో వెళ్లి కొయ్యాన కనకయ్య కాలనీలో గల ఎల్.ఎన్.ఫంక్షన్ హాల్ ఎదురుగా ఖాళీ ప్రదేశంలో కార్ పార్కింగ్ చేసుకోవాలి.
- అరసవల్లి టెంపుల్ మెయిన్ ఆర్చి ఎదురుగా గల సూర్యతేజ ఫంక్షన్ హాల్‌కు చెందిన ఖాళీ ప్రదేశం వీవీఐపీ పార్కింగ్ ప్రదేశంగా నిర్దేశించారు.
- వాడాడ జంక్షన్ వద్ద అనగా గార రోడ్డులో అసిరితల్లి అమ్మవారి గుడి దగ్గరలో గల అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవాలయం ఖాళీ ప్రదేశం కార్, ద్విచక్రవాహనాల పార్కింగ్ ప్రదేశంగా గుర్తించారు.
- ఖాజీపేట నుంచి వచ్చే వాహనాలకు అరసవల్లి ఎంహెచ్ స్కూల్ పక్కన గల అరసవల్లి శ్రీకాకుళం మున్సిపల్ శాఖకు చెందిన ఖాళీ ప్రదేశంలో కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు పార్కింగ్ చేసుకోవాలి.

### 80 ఫీట్ రోడ్డు పార్కింగ్ నుంచి బయటకు వెళ్లే మార్గం..

- 80 ఫీట్ రోడ్డు-వాంబే కాలనీ-పొన్నాడ బ్రిడ్జి కూడలి-సంతోషిమాత టెంపుల్-జెడ్పీ కార్యాలయం-కిన్నెర థియేటర్-ఓబీఎస్ కూడలి-ఏడురోడ్ల కూడలి-నవభారత్ కూడలి-ఎన్‌హెచ్-16 గుండా వెళ్లాలి.
- 80 ఫీట్ రోడ్డు పార్కింగ్ స్థలం ( కేంద్రమంత్రి స్వగృహం వెనుక ) నిలుపు ఆటోలు ఏపీహెచ్‌బీ కాలనీ మీదుగా జడ్పీ కార్యాలయానికి చేరుకోవాలి.
- పైన పేర్కొన్న ట్రాఫిక్ ఆంక్షలు ఈ నెల 2 ఉదయం 7 గంటల నుంచి 4వ తేదీ రాత్రి రథసప్తమి వేడుకలు ముగిసినంతవరకు కొనసాగుతాయి.
- 2, 3 తేదీల్లో ప్రభుత్వం పలు సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసింది. కార్యక్రమాలకు వచ్చేవారు వాహనాలను కేఆర్ స్టేడియంలో నిలుపుకోవాలి.
- గార వైపునుంచి వచ్చే టికెట్టు కొన్న భక్తులు అరసవల్లి అసిరితల్లి అమ్మవారి గుడి నుంచి ఆదిత్య నగర్ కాలనీ మీదుగా వెళ్లి ఉమెన్స్ కళాశాల మీదుగా అరసవల్లి మిల్లు కూడలి మీదుగా ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఖాళీ ప్రదేశానికి చేరుకుని పార్కింగ్ చేసుకోవాలి.
- అరసవల్లి గుడి పక్కన ఉండే నివాసగృహాల వారికి ఓ గంటపాటు అధికారులు నిర్దేశించిన సమయంలో ఉచిత దర్శనానికి అనుమతి.

## క్లుప్తంగా

### 7 నుంచి నాటిక పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రంగస్థలం కళాకారుల సంఘం ప్రతినిధులు

**ఆమదాలవలస:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 7, 8, 9వ తేదీలలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రంగస్థలం కళాకారుల సంఘం అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమదాలవలసలోని పాలపోలమ్మ తల్లి ఆలయ ఆవరణలో సంఘం కార్యదర్శి పేడాడ వెంకట ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో నాటిక పోటీల బ్రోచర్ ఆవిష్కరించారు. కళాకారులు, దాతల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నామని, ఆమదాలవలస కళాకారుల సంఘం అధ్యక్షుడు టీకే తిరునాధరావు, కార్యదర్శి బగాది వెంకటరమణ ఆధ్వర్యంలో రంగస్థలం టీవీ ఆల్ ఇండియా రేడియో కళాకారులు డాక్టర్ గోకవలస కృష్ణమూర్తి, కలియుగ నక్షత్రక పద్మశ్రీ యడ్ల గోపాలరావులను సన్మానిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్జేఈడీ పాత్రుని పాపారావు, సీనియర్ కళాకారులు సనపల అన్నాజీరావు, గొండు రవి, బొడ్డేపల్లి జనార్దనరావు, కాగితాపల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు ఆహ్వానం



శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న విజయకుమార్

**శ్రీకాకుళం అర్బన్:** ఏపీఎస్‌ఆర్టీసీ శ్రీకాకుళంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఆకాశపు విజయకుమార్ తెలిపారు. ఈ మేరకు 19వ బ్యాచ్‌ను శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైట్ వెహికల్ లైసెన్స్ కలిగి 21 ఏళ్లు నిండిన వారు అర్హులని, 40 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఫీజు, ఇతర వివరాలకు 8074640792, 7382923293 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఒకటి రెండు డిపోల మేనేజర్లు హనుమంతు అమర సింహుడు, కెఆర్‌ఎస్ శర్మ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

### నేడు ఇంటర్ విద్యార్థులకు 'నైతికత' పరీక్ష

**శ్రీకాకుళం న్యూకాలనీ :** ఇంటర్మీడియెట్ పరీక్షల పర్వం శనివారం నుంచి ప్రారంభం కానుంది. 1న ఫస్టియర్ విద్యార్థులకు నైతికత, మానవతా విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్) పరీక్ష, 3న పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష జరగనుంది. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నాయి.

### యువకుడిపై పోక్సో, వరకట్నం కేసులు

**ఎంవీపీకాలనీ:** బాలికపై లైంగికదాడి, పెళ్లి, అనంతరం వరకట్నం కోసం వేధింపులకు దిగిన యువకుడిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత శ్రీకాకుళం జిల్లా పొందూరు స్టేషన్‌లో జీరో ఎఫ్‌ఐఆర్‌గా ఈ కేసు నమోదు కాగా.. ప్రస్తుతం ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన బాలిక 2023లో ఇసుకతోట ఖుషీ బార్ వెనుక వీధిలో నివాసం ఉండేది. అదే ప్రాంతంలో ఉంటున్న విజయనగరం జిల్లా గంట్యాడ మండలం నీలావతి గ్రామానికి చెందిన శివ(21) బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉంటూ శారీరకంగా లోబరుచుకున్నాడు. విషయం పెద్దలకు తెలియడంతో ఇద్దరికీ వివాహం జరిపించారు. ప్రస్తుతం శివ, అతని కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శివపై పోక్సో, వరకట్నం, ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# దర్శనాల్లో వీఐపీ ట్రీట్‌మెంట్ రద్దు!

- ఎన్నికల కోడ్ అమలుతో రథసప్తమి దర్శనాలకు కొత్త ఆంక్షలు
- నేటి నుంచి యూనియన్ బ్యాంక్‌లో రూ.300 దర్శన టికెట్లు
- మధ్యాహ్నం నుంచి దాతల పాసుల పంపిణీ
- దర్శన మార్గాలపై కానరాని స్పష్టత



**అరసవల్లి:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పుణ్యమా అని అరసవల్లిలో ఈ నెల 3వ తేది అర్ధరాత్రి నుంచి జరగనున్న రథసప్తమి మహోత్సవానికి ప్రత్యేక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. కోడ్ నిబంధనల మేరకు ప్రోటోకాల్ దర్శనాలు, వీవీఐపి ట్రీట్‌మెంట్ దర్శనాలన్నీ దాదాపుగా రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హోదాలో వివిధ రకాల ఆంక్షలు అమల్లో ఉంటాయని స్పష్టం చేయడంతో అరసవల్లిలో ప్రస్తుతానికి ప్రశాంత వాతావరణం నెలకొంది. ఇంతవరకు ఏర్పాట్ల నిర్వహణ అంశంలో వరుసగా పర్యటనలు, పర్యవేక్షణ చేసిన ప్రజాప్రతినిధులు హడావుడి తగ్గడంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. సజావుగా భక్తుల దర్శనాలు జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నారు. ఇదిలావుంటే ఇంతవరకు వివిధ దర్శనాల మార్గాలపై స్పష్టత కరువైంది. గురువారం రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ నేరుగా అరసవల్లిలో ఏర్పాట్లను పరిశీలించిన క్రమంలో కూడా పూర్తిస్థాయిగా దర్శన మార్గాలు ఖరారు కాలేదని గుర్తించారు. దీనిపై ఈ నెల 2 లోగా అన్ని మార్గాలు ఫైనలైజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు ప్రత్యేకంగా ఆలయ ఈవో వై.భద్రాజీకి సూచించారు. కోడ్ అమల్లో ఉండడంతో ఆహ్వాన పత్రికల నుంచి టిక్కెట్ల ముద్రణ వరకు అన్నింటిలోనూ మార్పులు చేయాల్సి వచ్చింది.

**యూనియన్ బ్యాంక్‌లో టికెట్లు..**

రథసప్తమి నాడు వీఐపీ మార్గంలో దర్శనాలు చేసేందుకు ఒక్కొక్కరికి రూ.300 దర్శన టికెట్లను కొత్తగా అమల్లోకి తెచ్చారు. వీటిని శనివారం ఉదయం నుంచి అరసవల్లి యూనియన్ బ్యాంకులో నాలుగు స్లాట్‌లలో మొత్తం 6 వేల టిక్కెట్లను విక్రయించేలా చర్యలు చేపట్టారు. ఒక్కో స్లాట్ టైమింగ్ ద్వారా 1500 మందికి ప్రత్యేక దర్శన మార్గంలో అనుమతించనున్నారు. ఈమేరకు దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆమోదం తెలియజేయడంతో ఈవో వై.భద్రాజీ శుక్రవారం చర్యలు చేపట్టారు.

**యథావిధిగా క్షీరాభిషేక సేవ టికెట్లు..**

రథసప్తమి నాడు అంటే ఈ నెల 3వ తేది అర్ధరాత్రి 12.30 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 7 గంటల వరకు నిజరూప దర్శనంతో పాటు గర్భాలయంలో ఆదిత్యుని మూలవిరాట్టుకు పంచామృతాలతో పాటు క్షీరాభిషేక సేవ జరగనుంది. ఈసేవకు గాను రూ.500 టికెట్లను (ఇద్దరికి అనుమతి) ఎప్పటి లాగానే క్యూలైన్లోనే విక్రయించేలా ఏర్పాట్లు చేశారు.

**పేరుకు ఒకటే దోనర్ పాసు...!**

ఏటా రథసప్తమి ఉత్సవానికి వీఐపీల తాకిడితో పాటు దాతల పాసుదారుల హడావుడి అధికమవుతూ ఉంది. సజావుగా దర్శనం జరిగేలా విశిష్ట మార్గంలో స్వామిని దర్శించుకునేందుకు చాలా మంది భక్తులు ఆలయానికి అభివృద్ధి, ఇతరత్రా నిర్మాణాలు చేయించి రూ.లక్షకు మించి విరాళాలు ఇస్తున్న సంగతి విదితమే. ఇలా రూ.లక్ష ఇచ్చిన దాత కుటుంబ సభ్యులు నలుగురికి అనుమతించేలా ఒక డోనర్ పాసు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుంది. ప్రస్తుతానికి ఈ పాసుల సంఖ్య 1180 వరకు చేరింది. ఇందులో రూ.ఒక లక్ష వరకు విరాళాలు ఇచ్చిన వారు 800 మంది వరకు ఉంటారు. మిగిలిన దాతలు రూ.లక్ష నుంచి రూ.5 లక్షలలోపు అలాగే రూ.10 లక్షలలోపు అంతకుమించి కూడా విరాళాలచ్చిన దాతలున్నారు. ఇప్పుడు రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు రూపంలో ఆలయ దాతలకు ఆంక్షలు అమలు కానున్నాయి. ఒకే దాత పేరుతో ఎన్ని లక్షలు విరాళాలిచ్చినా.. ఒకే పాసు ఇవ్వాలంటూ ఇటీవల మంత్రి అచ్చెన్న ఆదేశించడంతో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఈవో వై.భద్రాజీలు సర్దిచెప్పినా మంత్రి నిర్ణయాన్ని వెనక్కితీసుకోలేదు. దీంతో ఒక దాత పేరుకు ఒకటే డోనర్ పాసు ఇచ్చేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. ఈ నిర్ణయంపై దాతలు తీవ్ర ఆందోళన, అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు. గత రథసప్తమికి లేని నిబంధనలను ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వంలో అమలుకు తేవడంపై అన్ని రంగాల వ్యక్తులు వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని అమలు చేసేలా ప్రస్తుత పరిస్థితులుండడంతో శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి దాతల పాసులను ఇచ్చే కార్యక్రమాన్ని ఆలయ అధికారులు ప్రారంభించనున్నారు. కాగా, ఇటీవల రిజిస్ట్రేషన్ చేసే సమయంలోనైనా ఒకరికి ఒక పాసే అని చెప్పుంటే రూ.లక్షకు మించిన విరాళాలను వారి కుటుంబసభ్యులు షేరింగ్‌తో పాసుల సంఖ్య పెరిగేలా చేసుకునేవాళ్లమని చాలా మంది దాతలు అభిప్రాయపడుతున్నారు. ఎలాంటి ప్రకటనలు చేయకుండా దాతలకు ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ పెట్టేసి 'పాసులిచ్చేస్తున్నామని.. సహకరించాలంటూ...' మెసేజీలు పెట్టేయడంపై దాతలు మండిపడుతున్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున జిల్లా పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్, 10వ తేదీ వరకు నామినేషన్ల సమర్పణ, 11న నామినేషన్ల పరిశీలన, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్, మార్చి 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని.. మార్చి 8న ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. 2024 డిసెంబర్ 30న ప్రచురించిన తుది ఓటరు జాబితా ప్రకారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో శ్రీకాకుళం జిల్లా వరకుగాను 31 కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లా పరిధిలో 4829 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో పురుషులు 3275, కాగా మహిళా ఓటర్లు 1554 మంది ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించాలని అధికారులు, నాయకులకు సూచించారు. నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన అనుమతులను వివరించారు.

ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నుంచి రౌతు శంకరరావు, టీడీపీ నుంచి పీఎంజే బాబు, కాంగ్రెస్ నుంచి కేవీఎల్‌ఎస్.ఈశ్వరి, బీఎస్పీ నుంచి లాసా సోమేశ్వరరావు, బీజేపీ నుంచి సురేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### మంచు కురిసే వేళలో..



జిల్లాలో మంచు ప్రభావం కొనసాగుతోంది. వారం రోజులుగా వేకువజాము 4 గంటల నుంచి ఉదయం 8.30 గంటలకు మంచు కమ్ముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీడి మామిడి పూత మాడిపోయి పంటకు నష్టం కలుగుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

- జి.సిగడాం

## రాతికర్ర, జలగల చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలి



రాతికర్ర చెరువు



జలగల చెరువు

**నరసన్నపేట:** మండల కేంద్రం నరసన్నపేటలో చెరువుల ఆక్రమణలపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఇప్పటికే రాజుల చెరువులో ఆక్రమణలపై గరీబు గైడు అనే స్వచ్ఛంద సంస్థ జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేసింది. దీనిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. అదే సంస్థ ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు న్యాయవాది డీవీ రావు నరసన్నపేటలోని రాతికర్ర చెరువు, జలగల చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని, చెరువులకు పూర్వ రూపం తీసుకురావాలని జిల్లా అధికారులకు అత్యవసర నోటీసులు శుక్రవారం పంపారు. ఒకవైపు చెరువుల స్థలాల్లో ఎటువంటి క్రయవిక్రయాలు జరగకూడదని, ఇవి నిషేధిత భూములని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని.. మరో వైపు కొందరికి డీపట్టాలు ఎలా ఇస్తారని.. చెరువులు ఆక్రమణలకు గురవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని నోటీసులో పేర్కొన్నారు. ఆక్రమణలు వెంటనే తొలగించకపోతే జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో పిటిషన్ వేస్తామని స్పష్టం చేశారు. రాతికర్ర చెరువు విస్తీర్ణం 2.75 ఎకరాలు కాగా 2.11 ఎకరాలు ఆక్రమణకు గురైందని, జలగల చెరువు విస్తీర్ణం 13.22 ఎకరాలు కాగా చాలా మేరకు ఆక్రమణలు జరిగియాని తెలిపారు.

## వెలుగుల రేడు వేడుక చేద్దాం



# రథసప్తమి సంబరాలకు సర్వం సిద్ధం

- మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:**

అరసవల్లి రథసప్తమి వేడుకలకు చురుగ్గా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలు ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం సామూహిక సూర్య నమస్కారాలతో ప్రారంభమవుతాయని అన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం 80 అడుగుల రోడ్డులో సుమారు మూడు వేల మందితో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహిస్తామని, వేడుకల ప్రారంభం రోజు శోభాయాత్ర ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలతో పాటు గ్రామీణ క్రీడలైన కర్రసాము, సంగిడీలు, ధాన్యం గోనెలు ఎత్తడం, వెయిట్ లిఫ్టింగ్ వంటి పోటీలు నిర్వహిస్తారని, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం, తప్పెటగుళ్లు, చెంచు బాగోతం, చెక్కభజన, తుర్పు భాగవతం, తాలీ ఖానా, నాద స్వరం, డప్పు వాయిద్యం, గిరిజనుల థింసా నత్యం, నేలవేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయంటూ వాటి ఏర్పాట్లపై చర్చించారు. తొలిసారి జిల్లాలో హెలికాప్టర్ టూరిజం నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు గణపతి శర్మ, నీరజా సుబ్రమణ్యం, శ్రీకాంత్ బృందాలతో నృత్యాలు, గాయని మంగ్లీతో ఆర్కెస్ట్రా వంటి ఏర్పాట్లపై సంబంధిత అధికారులను అడిగారు. పారిశుద్ధ్యం, మంచి నీరు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు.



రథసప్తమి ఉత్సవాలపై మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

### తొలిసారిగా హెలికాప్టర్ టూరిజం

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** అరసవల్లి రథసప్తమి వేడుకలను జిల్లాలో మూడు రోజుల పాటు అంబరాన్ని తాకేలా నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా తొలిసారి హెలికాప్టర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రథసప్తమి ఉత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సామూహిక సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయని, మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎద్దుల బండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తామని, అలాగే డచ్ బిల్డింగ్ వద్ద క్రాకర్స్ షో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హెలికాప్టర్ నిర్వాహకులకు సైట్ చూపించడం జరిగిందన్నారు. టికెట్ తీసుకున్న యాత్రికులు ఎలా హెలిప్యాడ్ వద్దకు చేరుకోవాలి, ఎక్కడ వేచి ఉండాలో నిర్దేశిస్తూ చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సాయి ప్రత్యూష, డ్వామా పీడీ సుధాకర్ రావు, కొవ్వాడ ప్రత్యేక ఉప కలెక్టర్ లక్ష్మణరావు, జిల్లా విపత్తు నివారణ అధికారి మోహన రావు, ఏఈ సురేష్ సంబంధిత అధికారులు సిబ్బంది హాజరయ్యారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఆధిపత్య పోరు

- పరిశోధన విద్యార్థులకు తప్పని పాట్లు
- వైవా వాయిస్ వాయిదా

**ఎచ్చెర్ల క్యాంపస్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య ఆధిపత్య పోరు ఏకంగా వైవా వాయిస్ వాయిదా పడటానికి కారణమైంది. ఇక్కడ ఏడు రెగ్యులర్ బోధకులు పనిచేస్తున్నారు. బయోటెక్నాలజీలో నలుగురు, సోషల్ వర్కులో ఇద్దరు, ఎకనామిక్స్‌లో ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. ఈ విభాగాల్లో మాత్రమే పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తున్నారు. సోషల్ వర్కు పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్ వైవా వాయిస్ విషయంలో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల మధ్య విభేదాలు పొడచూపాయి. ప్రస్తుతం ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోషల్ వర్కులో ఉన్నారు. ఒకరు ప్రిన్సిపాల్, ఒకరు హెచ్‌ఓడీగా పనిచేస్తున్నారు. రీసెర్చ్ స్కాలర్ విద్యార్థులకు శుక్రవారం ఇద్దరికి ప్రీటాక్ నిర్వహించారు. ఇతర విశ్వవిద్యాలయం నుంచి ఎక్సటర్నల్ వచ్చారు. దీంతో అర్హత ఉన్న ఒక విద్యార్థికి గైడుగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్(ప్రిన్సిపాల్) వైవా వాయిస్‌కు అనుమతి కోరారు. అయితే హెచ్‌ఓడీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ వైవా వాయిస్‌కు అనుమతి ఇవ్వలేదు. ఈ అంశం ఉన్నతాధికారుల దృష్టి ప్రిన్సిపాల్ తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. అధికారులు జోక్యం చేసుకొని సమస్య పరిష్కరించకపోవటం సైతం చర్చనీయాంశంగా మారింది.

## తక్కువ ధరలకే వాహనాలు

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** సిక్కోలు ప్రజలకు సరికొత్త వాహనాలను తక్కువ ధరకే అందిస్తామని పద్మపూజిత ఆటో ఫైనాన్స్, వీల్మార్ట్ సంస్థ చైర్మన్ బసవ రాజు అన్నారు. శ్రీకాకుళం నగరంలో పెద్దపాడు రోడ్డు, జీవన్ జ్యోతినగర్‌లో నూతన షోరూమ్‌ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమ సంస్థకు టూ వీలర్ వెహికల్ ఫైనాన్స్, ఆటోమొబైల్ రంగంలో 22 ఏళ్ల విశిష్ట అనుభవం ఉందన్నారు. తెలుగు రాష్ట్రాలలో 135 పైగా బ్రాంచీలు ఉన్నాయని చెప్పారు. 600కు పైగా పలు రకాల వాహనాలు కస్టమర్లకు అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన వారికి తక్షణం ఫైనాన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు సాయి, రమేష్, శ్రీనివాస్, సతీష్ ప్రసాద్, సతీష్, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన షోరూమ్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ బసవ రాజు

## ఐదు కేజీల గంజాయితో నలుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

**టెక్కలి రూరల్:** కోటబొమ్మాళి మండలం జర్జంగి సమీపంలో సాయికాన్విక దాబాలో శుక్రవారం అక్రమంగా విక్రయిస్తున్న ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు టెక్కలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు తెలిపారు. కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్ ఆవరణలో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. పక్కాగా అందిన సమాచారం మేరకు డాబాలో తనిఖీలు నిర్వహించగ పలు విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో కేరళ నుంచి ఒడిశా వైపు వెళ్లే ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు దాబా వద్ద ప్రయాణికుల భోజనాల కోసం ఆగుతుంటుంది. బస్సులో పని చేస్తున్న కేరళకు చెందిన శ్రీజిత్ విజయ్ అనే వ్యక్తి దాబా వద్ద గంజాయి తాగుతుండటాన్ని చూసి దాబా యజమాని, సారవకోట మండలం జగన్నాథపురానికి చెందిన కొల్లి బాలరాజు, గ్రానైట్ పరిశ్రమ కూలీ మోహన్‌లాల్ జంగిల్(రాజస్థాన్), బిరేస్వల్ బిశ్వాల్(ఒడిశా)లు తమకూ గంజాయి కావాలని కోరగా అంగీకరించాడు. ఈ సమాచారం పోలీసులకు తెలియడంతో ఎస్‌ఐ వి.సత్యనారాయణ, సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించగా జర్జంగి ఫ్లై ఓవర్ వద్ద పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

### సర్వేయర్ ఆత్మహత్య



సింహాచలం (ఫైల్)

**నరసన్నపేట:** స్థానిక మారుతీనగర్-3లో నివాసముంటున్న సర్వేయర్ యేడిళ్ల అప్పల నరసింహం(సింహాచలం)(53) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, అందుకే ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. నరసన్నపేటతో పాటు జిల్లాలో పలు మండలాల్లో మండల సర్వేయర్‌గా పనిచేసిన ఈయన ప్రస్తుతం విజయనగరంలోని సర్వే ఏడీ కార్యాలయంలో టాస్క్‌ఫోర్స్ విభాగంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. వారం రోజులుగా ఇంటి వద్దే ఉంటున్న ఈయన శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భార్య భనిశెట్టి సద్గునాంబ కోటబొమ్మాళి మండలంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఎప్పటిలా స్కూల్ నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి సింహాచలం అపస్మారక స్థితిలో కనిపించడంతో స్థానికుల సహకారంతో సమీప ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సింహాచలం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. భార్య సద్గునాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సింహాచలంకు కుమార్తె సత్య షర్మిళ, కుమారుడు నిత్య సుజిత్ ఉన్నారు.

## ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లపై సస్పెన్షన్ వేటు

**కాశీబుగ్గ:** జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం సంబంధించి మందస మండలంలో ప్రజావేదిక సామాజిక తనిఖీ ఆడిట్‌లో అవినీతి రుజువు కావడంతో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేస్తూ ఏపీడీ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మందస మండలంలో 14 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్లు రుజువైనా వారిలో ఆరుగురు పెద్ద మొత్తంలో అవినీతి చేసినట్లు ఎస్‌ఆర్‌పీలు, డీఆర్‌పీలు ఆడిట్ ఆధారాలు, నివేదికలు సమర్పించడంతో రాంపురం, మందస, పొత్తంగి, సరియాపల్లి, బేతాళపురం, మరొక పంచాయతీ ఎఫ్‌ఏను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయని మందస ఏపీఓ హరికృష్ణ తెలిపారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ

భూముల ధరలు పెరుగుతాయనే ముందస్తు సమాచారంతో చివరి రోజు శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. వందలాది మంది తరలిరావడం, నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. – శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద చిన్నారుల పడిగాపులు



శ్రీకాకుళం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ



రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న కొనుగోలుదారులు, అమ్మకందారులు